నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
I | ఖమ్మం, బుధవారం 1 మే 2024 | BHADRADRI KOTHAGUDEM

ఉమ్మడి జిల్లా నాయకులతో సమీక్షిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

బీఆర్ఎస్‌కే గెలుపు అవకాశాలు

ముఖ్య నాయకులతో అధినేత కేసీఆర్

ఖమ్మం, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే గెలుపు అవకాశాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా ముఖ్య నాయకులతో అధినేత కేసీఆర్ అన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ స్థానాలను గెలిచి తీరాలన్నారు. మంగళవారం కొత్తగూడెం రోడ్ షో అనంతరం ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ముఖ్య నాయకులతో ఇల్లెందు అతిథి గృహంలో సమావేశమయ్యారు. ''మనకుసానుకూల వాతావరణం ఉంది. కాంగ్రెస్‌ను, బీజేపీని ప్రజలు తిరస్కరిస్తున్నారు. ఇక్కడి రెండు ఎంపీ స్థానాలను గెలిపించుకోవాలి'' అని అన్నారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పార్టీ రెండు జిల్లాల అధ్యక్షులు రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఎంపీ అభ్యర్థులు నామా నాగేశ్వరరావు, కవిత, మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ, నాయకుడు దిండిగల రాజేందర్ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు కాంగ్రెసోళ్ల అభివాదం

ప్రతిగా అభివాదం తెలిసిన బీఆర్ఎస్ అధినేత

కొణిజర్లలో చోటుచేసుకున్న ఆసక్తికర ఘటన

కొణిజర్ల, ఏప్రిల్ 30 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తలపెట్టిన బస్సు యాత్రలో మంగళవారం సాయంత్రం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల కేంద్రంలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఖమ్మం నుంచి కొత్తగూడెం రోడ్ షోలో పాల్గొనేందుకు వెళ్తున్న కేసీఆర్‌కు కొణిజర్ల సెంటర్‌లో గుమిగూడి ఉన్న కాంగ్రెస్ శ్రేణులు ఆనందోత్సాహంతో అభివాదం చేశారు. రెండు రోజులుగా ఖమ్మం బీఆర్ఎస్ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ జిల్లాలో కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రకు జననీరాజనం పలుకున్న విషయం విదితమే. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఖమ్మం నుంచి కొత్తగూడెం బయల్దేరిన కేసీఆర్ బస్సు యాత్ర కొణిజర్ల మండలం తనికెళ్ల దాటి కొణిజర్లకు చేరింది. ఇదే సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్వాపురం క్రాస్‌రోడ్డు వరకు రోడ్ షోలో భాగంగా కాంగ్రెస్ కార్యకర్తలతోపాటు కమ్యూనిస్టు పార్టీలకు చెందిన శ్రేణులు బస్వాపురం క్రాస్ రోడ్డుకు చేరుకున్నారు. ఇదే సమయంలో ఖమ్మం నుంచి వస్తున్న కేసీఆర్ బస్సును స్థానిక బీఆర్ఎస్ నాయకుడు బోడపోతుల బాబు ఇంటి ఎదుట నిలిపేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించారు. సమయం తక్కువగా ఉండడంతో బస్సు ముందుకు సాగింది. బీఆర్ఎస్ శ్రేణులంతా కేసీఆర్‌కు అభివాదం తెలుపుతూ ఆయన ఫొటోలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ జై కేసీఆర్ అంటూ బస్సు వెంట పరుగెత్తారు. కాంగ్రెస్ శ్రేణులు కూడా గుంపుగా ఉండి ఒక్కసారిగా కేసీఆర్‌ను చూసి ఆనందంతో చేతులు ఊపుతూ తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. దీంతో కేసీఆర్ సైతం ప్రతిగా అభివాదం తెలపడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు కేరింతలు కొట్టారు.

'పది'లో 90.39 శాతం ఉత్తీర్ణత

భద్రాచలం : విద్యార్థులకు మెమోంటోలు అందజేసిన లిటిల్ ఫ్లవర్స్ డైరెక్టర్లు

ఇల్లెందు రూరల్: ఉతీర్ణులైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బూర్గంపహాడ్: విద్యార్థులతో ప్రిన్సిపాల్ గీతా జ్యోతి, పాఠశాల కోఆర్డినేటర్ మల్లీశ్వరి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 90.39 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 26వ స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని కలెక్టర్‌కు డీఈవో వెంకటేశ్వరాచారి తెలిపారు. ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయంటూ ఆయనను కలెక్టర్ అభినందించారు. డీఈవో తెలిపిన వివరాలు.. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా మొత్తం 12,294 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 5,875 మంది బాలురు, 6,419 మంది బాలికలు ఉన్నారు. బాలురు 5,381 మంది (88.19 శాతం), బాలికలు 5,931 మంది (92.40 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం గత ఏడాది 78.53 ఉండగా, ఈసారి 90.39 సాధించి, రాష్ట్రంలో 26వ స్థానంలో నిలిచింది. గత ఏడాదికంటే 11.86 శాతం ఎక్కువ ఉత్తీర్ణత నమోదైంది. జిల్లాలోని మొత్తం 87 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. వీటిలో ప్రైవేట్ పాఠశాలలు 35, ప్రభుత్వ పాఠశాలలు 52 ఉన్నాయి. ఫెయిల్ అయిన వారు మే 16వ తేదీ లోపు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా సంబంధిత పాఠశాలల్లో ఫీజు చెల్లించవచ్చు.

గిరిజన విద్యార్థినికి 10 జీపీఏ

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 30: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని భీమునిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన కె.జ్యోతి చందు 10 జీపీఏ సాధించింది. అశ్వారావుపేట మైనార్టీ గురుకుల పాఠశాల నుంచి పరీక్షలు రాసిన విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యారు. వీరిని ఎంఈవో పి.కృష్ణయ్య అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సంపూర్ణం..

కరకగూడెం, ఏప్రిల్ 30: మండలంలోని కరకగూడెం జడ్పీ పాఠశాల, భట్టుపల్లి జడ్పీ పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాల, చిరుమళ్ల ఆశ్రమ పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 30: మండలంలోని తెలంగాణ మైనార్టీ స్కూల్ నుంచి పరీక్షలు రాసిన 47 మందిలో అందరూ ఉత్తీర్ణత సాధించారు. వీరిని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ అరుణ కుమారి, జిల్లా కోఆర్డినేటర్ అఫ్రోజ్ తదితరులు అభినందించారు.

టేకులపల్లి, ఏప్రిల్ 30: మండలంలోని గంగారం ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ సులానగర్ పాఠశాల, జిల్లా పరిషత్ బొమ్మనపల్లి, జిల్లా పరిషత్ కుంటల్ల, టేకులపల్లి ఎంజేపీటీ బీసీ డబ్ల్యూఆర్ బాలుర పాఠశాలలు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి. విద్యార్థులకు ఎంఈవో రాంసింగ్ అభినందనలు తెలిపారు.

'లిటిల్ ఫ్లవర్స్' ప్రభంజనం

భద్రాచలం, ఏప్రిల్ 30: పదోతరగతి ఫలితాల్లో స్థానిక లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బిట్ల హసనీ 10జీపీఏ సాధించింది. రేపాక నాగసాయి మోనీష్ 9.7, కోటగిరి దేవి ప్రసన్న 9.2, సేరు నాగ శ్రీవల్లి 9.2, ఏనుక సాద్విక్ 9, తిరువీజుల జశ్విని 9.0, కుందమళ్ల వర్షిత వర్ధిని 9.0 జీపీఏ సాధించారు. వీరిని డైరెక్టర్లు మాగంటి ప్రసాద్‌బాబు, మాగంటి రమేశ్‌బాబు అభినందించారు.

సత్తా చాటిన 'శ్రీవిద్య'

విద్యార్థులను అభినందిస్తున్న సీఈవో చైతన్యకృష్ణ

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 30: పదోతరగతి ఫలితాల్లో శ్రీవిద్య స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యారు. పావని, ఉదయ్ ఆదిత్య, నైష 10 జీపీఏ సాధించారు. 13మంది 9.8 జీపీఏ, 52మంది 9.0కు పైగా జీపీఏ సాధించారు. వీరిని విద్యాసంస్థల సీఈవో చైతన్య కృష్ణ, ప్రిన్సిపాల్ నిరుపమ, అకడమిక్ కో ఆర్డినేటర్ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్నికల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మామిళ్లగూడెం, ఏప్రిల్ 30 : ఎన్నికల శిక్షణను అధికారులు సద్వినియోగం చేసుకొని, ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జి కోల్టే, రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాలల్లో పీవో, ఏపీవో, ఓపీవోలకు విధుల పై చేపట్టిన శిక్షణా కార్యక్రమాన్ని ఎన్నికల పరిశీలకులు, రిటర్నింగ్ అధికారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీవో, ఏపీవో, ఓపీవోలు ఒక టీమ్‌ల పూర్తి అవగాహనతో పనిచేయాలన్నారు. పోలింగ్, పోలింగ్ యంత్రాల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్‌కేంద్రంలో ఏర్పాట్లపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలన్నారు. ఎన్నికల అధికారులు, బ్యాలెట్ యూనిట్, ఏజెంట్‌ల సీటింగ్ నమూనా మేరకు చేపట్టాలన్నారు. పోలింగ్ యంత్రాల సమస్యలు ఎదురైతే వెంటనే సెక్టార్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. మాక్ పోలింగ్, పోలింగ్ సందర్భంలో సాంకేతిక సమస్యలు ఎదురైనప్పుడు చేపట్టాల్సిన చర్యలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ అధికారులు-1, 2, 3లు ఎన్నికల సందర్భంలో ఏ ఏ విధులు నిర్వర్తించాలో మార్గదర్శకాల మేరకు నడుచుకోవాలన్నారు. మాక్ పోల్ పూర్తయ్యాక తప్పనిసరిగా క్లియర్ చేయాలన్నారు. బూత్ ఆక్రమణ, అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఎవరిని అనుమతించాలి, క్యూ నిర్వహణ ఎలా చేయాలి, ఓటర్ల గుర్తింపు ఏ విధంగా చేపట్టాలి, ఈ సందర్భంగా పవర్ పాయిట్ ప్రజంటేషన్ ద్వారా పోలింగ్ అధికారుల విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కల్పించారు. ఓటింగ్ యంత్రాలపై హ్యాండ్స్ ఆన్ శిక్షణ ఇచ్చారు. వారికి కేటాయించిన పోలింగ్‌కేంద్రాల్లో తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. ఇతర నియోజకవర్గాల్లో ఓటుహక్కు ఉన్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ జారీ చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, ఆర్డీవోలు ఎల్. రాజేందర్, మధు, మాస్టర్ ట్రెయినర్లు శ్రీరామ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శిక్షణ నోడల్ అధికారి అలీం, అధికారులు పాల్గొన్నారు.